## గృహ ప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే హాజరు



మెదక్ మున్సిపాలిటీ, మే 15: పిల్లికోటాల్‌లోని జర్నలిస్ట్ కాలనీలో పాత్రికేయుడు శ్రీకాంత్ గృహ ప్రవేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు, హవేళీ ఘనపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం: కలెక్టర్



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

చిలిపిచెడ్, మే 15: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీవోతో కలిసి గురువారం పరిశీలించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో తహసీల్దార్ సహదేవ్, ఎంపీడీవో ఆనంద్, రెవెన్యూ, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

## బేకరీలు, హోటళ్లపై కొనసాగుతున్న దాడులు




మెదక్ మున్సిపాలిటీ, మే 15: మెదక్‌లోని హోటళ్లు, స్వీట్‌హౌస్‌లు, బేకరీలపై వారం రోజులుగా మున్సిపల్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. యజమానులు నాణ్యత పాటించకపోవడంతో పాటు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగించిండం షరా మామూలైంది. దీంతో దాడులు చేసి నిల్వ ఆహార పదార్థాలు, గడువు తీరిన కూల్ డ్రింక్స్‌ను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. నిబంధనలు పాటించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు.

## విత్తన కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి

నర్సాపూర్, మే 15: విత్తన కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని ఏవో దీపిక సూచించారు. గురువారం మండలంలోని రాంచంద్రాపూర్, చిన్నచింతకుంట, లింగాపూర్ గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు సుశీల, శాంతి, రవీందర్‌నాయక్, అమీర్‌పాషా, అఫిఫా జహాన్, ఏఈవో రవివర్మ, దుర్గాప్రసాద్, లక్ష్మి, ఉద్యానవన అధికారి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## పట్టపగలే బైక్ చోరీ



రామాయంపేటలో ఇంటి ముందున్న బైక్‌ను తీసుకెళ్తున్న దుండగుడు

రామాయంపేట, మే 15: ఇంటిముందు తాళం వేసి ఉన్న గ్లామర్ బైక్‌ను ఓ దుండకుడు పట్టపగలే దర్జాగా దొంగలించిన ఘటన రామాయంపేటలోని మంజీరా కాలనీలో జరిగింది. బాలకృష్ణ కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పట్టణంలోని అద్దెకున్న ఇంటి బయట బైక్ పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తి గ్లామర్ బైక్ తాళాలు ధ్వంసం చేసి తీసుకెళ్లాడు. బాధితుడు బాలకృష్ణ రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని చూడగా దుండగుడు బైక్‌ను తీసుకెళ్తున్న దృశ్యం కనిపించింది. విచారణ చేపడ్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు.. కనెక్షన్ మరిచారు



నిరుపయోగంగా పడి ఉన్న 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొల్చారం, మే 15: కొల్చారంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించి అయిదేండ్లు గడుస్తున్నది. ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. గ్రామంలోని రెండో, మూడో వార్డులో గృహోపయోగాల కోసం సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో 100 నుంచి 120 ఇండ్లు ఉండడంతో ఓవర్ లోడ్ కారణంగా తరుచూ కరెంటు కట్ అవుతున్నది. దీంతో విద్యుత్ అధికారులు 1, 2, 3 వార్డుల విద్యుత్ అవసరాలు తీరేలా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీనికి సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్ రాబట్టుకున్నాడు. కానీ ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. దీంతో ఎప్పటిలాగే సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌తోనే సరఫరా అవుతున్నది. ఓవర్‌లోడ్ కారణంగా ఫూస్ కొట్టేస్తున్నది. ఈ విసయమై విద్యుత్ ఏఈ హైమద్ అలీని వివరణ కోరగా.. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభించడానికి 12 విద్యుత్ స్తంభాలు, ఎల్‌టీ విద్యుత్ తీగలు అవసరముంటాయన్నారు. నిధులు మంజూరవగానే పనులు మొదలు పెడతామని విద్యుత్ అధికారులు తెలిపారు.

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

శివ్వంపేట, మే 15 : దొంతి గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. గ్రామంలో వేణుగోపాలస్వామి జాతర సందర్భంగా అక్కడకు వచ్చిన మహిళలకు బాలల చట్టాలపై వివరించారు. బాల్య వివాహాలు, పిల్లలపై లైంగికదాడి, బాలికల విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసుమతి, బాలల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్లు శంకర్, సరిత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, హేమలత, ఫహీమున్నీసా ఉన్నారు.

## పడకేసిన పారిశుధ్యం





మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- డీజిల్ డబ్బుల్లేక మూలనపడ్డ ట్రాక్టర్
- పేరుకుపోయిన పెట్రోల్ ఉద్దెర
- నిధుల్లేక పంచాయతీలో పనులు అస్తవ్యస్తం

నర్సాపూర్, మే15: పంచాయతీల్లో నిధుల్లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్తను తొలిగించడానికి ట్రాక్టర్‌లో డీజిల్‌కు డబ్బులు లేవు. మండలంలోని తుజాల్‌పూర్‌లో పారిశుధ్య లోపం కండ్లకు కట్టినట్లు కనపడుతున్నది. మురుగు కాల్వల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ పోయడానికి డబ్బులు లేక ట్రాక్టర్‌ను మూలనపడేశారు. శుభకార్యాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ ట్యాంకర్‌కు రూ.200 సేకరిస్తూ డీజిల్ పోస్తూ పారిశుధ్య పనులు చేపడుతున్నారు. అర్జు తండా, వాల్యా తండా, వసురాంతండాల్లో ట్రాక్టర్ జాడ లేక తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు.





గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

# అన్నదాతల కష్టం.. వర్షార్పణం

- అకాల వార్షంతో కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఇరువై రోజులు, నెల కిందే కేంద్రాలకు తెచ్చినా సేకరణలో తాత్సారం
- ప్రభుత్వమే ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు



చిలిపిచెడ్: చిట్కుల్‌లో తడిసిన ధాన్యం



కొల్చారం: వై మాందాపూర్‌లో నీటిలో ధాన్యం రాశి



చిలిపిచెడ్: నీటిలో నుంచి ధాన్యం తీస్తున్న మహిళ

చిలిపిచెడ్, మే 15: ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంతో అన్నదాతల కష్టం వర్షార్పణమైంది. ఇరువై రోజుల కింద నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చినా.. జాప్యం చేయడం రైతులు నిండా మునిగారు. అకాల వర్షంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. మండలంలోని చిట్కుల్, చిలిపిచెడ్, చండూర్, గౌతాపూర్ ఆయా గ్రామాల్లో వరదకు ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి.

### కొల్చారంలో..

కొల్చారం, మే 15: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో అధిక తరుగు, వర్షం, లారీలకు అదనపు చార్జీలు వంటి సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. కొల్చారం, పోతంశెట్టిపల్లి, రంగంపేట గ్రామాలతో పాటు పలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు ఆరేడు రోజులుగా ఎక్కడివి అక్కడే ఉండడంతో వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. కొన్నిచోట్ల బస్తాకు 2.5 కిలోల చొప్పున క్వింటాలుకు 4.5 నుంచి 5 కిలోల తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎట్టకేలకు తూకం వేసినప్పటికీ లారీలు రాక బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతున్నాయి. దీనికి తోడు లారీ యజమానులు ఒక్కో బస్తాకు 2 నుంచి 3 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

### కొనుగోలు కేంద్రాల సందర్శన

రెండు రోజులగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ శ్రీనివాసచారి మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొల్చారం, పోతంశెట్టిపల్లి, రంగంపేట్ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పెద్దశంకరంపేట, మే15: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్ అన్నారు. పెద్దశంకరంపేటలో నిర్వహిస్తున్న జొన్న, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయనతో సీఈవో రవీందర్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

### తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

చిన్నశంకరంపేట, మే 15: ధాన్యం తూకంలో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మన్నన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఎస్.కొండాపూర్, గవ్వలపల్లి తదితర గ్రామాల్లో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుందని తెలిపారు.

### ఇబ్బంది పడ్డ రైతాంగం

పాపన్నపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. నీటిని తొలిగింయేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

### వేగంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

వెల్దుర్తి, మే 15: వేగంగా ధాన్యాన్ని కొనుగోళ్లు చేయాలని తహసీల్దార్ బాలలక్ష్మి అన్నారు. వర్షాలతో మండలంలోని యశ్వంతరావు పేట, మంగళపర్తి, కుకునూరు ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. విషయం తెలుసుకుని తహసీల్దార్ కేంద్రాలను పరిశీలించారు.

### మెదక్ మండలంలో భారీ వర్షం

మెదక్ రూరల్, మే 15: మెదక్ మండలంలోని మాచవరం, చిట్యాల తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. భారీవ ర్షం కురవడంతో ధాన్యం కొను గోలు కేంద్రాల్లో కొనుగోలు కోసం ఉంచిన వరిధాన్యం తడిసిపోయింది.



కొల్చారం: వర్షానికి మొలకలు వచ్చిన ధాన్యం



పాపన్నపేట: వరదకు తడిసిన ధాన్యం కుప్పలు



వెల్దుర్తి: యశ్వంతరావుపేటలో తహసీల్దార్ బాలలక్ష్మి



కొల్చారంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

# వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



దొంతిలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



నర్సాపూర్: ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

- రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, మే 15: మండలంలోని దొంతి గ్రామంలో యేటా నిర్వహించే వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వారం రోజులుగా వైభవంగా జరిగాయి. గురువారం చివరిరోజు వేణుగోపాలస్వామి పల్లకీ సేవతో పాటు రథం ఊరేగింపును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా వాటర్‌బాటిళ్లు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా మజ్జిగ, ఆర్య వైశ్య సంఘం వారు పులిహోర పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, లాయక్, మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాలస్వామి ఉన్నారు.

### వనదుర్గామ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పాపన్నపేట, మే 15: ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

### ఎల్‌వోసీ అందజేత

నర్సాపూర్, మే 15: పట్టణానికి చెందిన బబ్బురి శ్రీనివాస్‌కు రూ.లక్ష, గూడెంగడ్డకు చెందిన బాలమణికి రూ.లక్ష ఎల్‌వోసీ పత్రాలను నర్సాపూర్ క్యాంపు కార్యాలయం లో బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే అందజేశారు. సత్యం గౌడ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు స్వామి, పోచాగౌడ్, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్, వీరేశ్ పాల్గొన్నారు.

## మడెల్లయ్య స్వామి గుడి నిర్మాణానికి పూజ

రామాయంపేట, మే 15: మండలంలోని ఝాన్సీలింగాపూర్‌లో రజకుల కులదైవం మడెల్లయ్య స్వామి గుడి నిర్మాణానికి మాజీ సర్పంచ్ మానెగల్ల రామకిష్టయ్య గురువారం భూమి పూజ కార్యక్రమంలో బానప్పగారి నర్సారెడ్డి, చాకలి పోచయ్య తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



చిన్నశంకరంపేట, మే 15: ధర్పల్లిలో కుర్మసంఘం ఆధ్వర్యంలో బీరప్ప జాతరలో బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.

## వృద్ధురాలు అదృశ్యం



మల్లమ్మ (ఫైల్)

నర్సాపూర్, మే 15: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మండలంలోని తుజాల్‌పూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. గాలి మల్లమ్మ(60) రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తెస్తానని ఇంట్లో చెప్పి మంగళవారం వెళ్లింది. ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేదు. మల్లమ్మ కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఉత్తమ ప్రతిభకు పురస్కారం



రేగోడ్, మే 15: ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేజీబీవీ ప్రత్యేకాధికారిని స్వయంప్రభకు కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, డీఈవో రాధాకిషన్, ఎంపీ రఘునందన్ రావు సన్మానించి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నిజాంపేట, మే 15: నిజాంపేటకు చెందిన కొమ్మాట నర్సవ్వ శ్రీను దంపతుల చిన్న కుమారుడు రఘు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంఘ సేవకుడు చల్మెటి నరేందర్, భాగ్యలక్ష్మి బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## పోషకాహారంపై దృష్టి సారించాలి

చిలిపిచెడ్, మే 15: మహిళలు పోషకాహారంపై దృష్టి సారించాలని నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి తెలిపారు. గురువారం సూపర్‌వైజర్ సంతోషి మాతతో కలిసి అంగన్‌వాడీ సెంటర్‌లోని పిల్లల ఎత్తు, బరువు వట్టివి పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

## పెండ్లింట చావు బాజా

### ఆరు రోజుల్లో కూతురు పెండ్లి, తండ్రి హఠాన్మరణం



నాగయ్య (ఫైల్)

అల్లాదుర్గం, మే 15: పెండ్లి బాజాలు మోగాల్సిన చోట చావు డప్పు మోగిన విషాదకర ఘటన మండలంలోని బహిరన్‌దిబ్బలో గురువారం జరిగింది. నడిమింటి నాగయ్య (50) పెద్ద కూతురు తేజ వివాహం ఈనెల 21న జరగాల్సి ఉంది.అందుకు నాగయ్య అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాడు. ఇంతలోనే గురువారం ఉదయం నాగయ్య గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడి చిన్న కూతరు అశ్విని తండ్రికి తలకొరివి పెట్టింది.

## జమ చేసిన డబ్బులివ్వాలని ఆందోళన



కొల్చారం: పోస్టాఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

కొల్చారం, మే 15: జమ చేసిన డబ్బులివ్వాలని పలువురు ఖాతాదారులు కొల్చారం పోస్టాఫీస్ ఎదుట గురువారం ఆందోళన చేశారు. కొందరు వ్యక్తులు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో నెలనెలా డబ్బులు చెల్లించేలా రికవరింగ్ డిపాజిట్లు చేస్తున్నారు. పోస్టాఫీస్ సిబ్బంది ఖాతాదారులకు నకిలీ పాసుపుస్తకాలు ఇచ్చి డిపాజిట్ చేసినట్లు నమ్మించారు. నాలుగు నెలల క్రితం బ్రాంచ్ పోస్ట్‌మెన్‌గా బాధ్యతలు నిర్వహించిన లంబాడి రవి అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం కొన్ని రోజులకు అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కొత్త శేకులు ఖాతాదారుల ఇంటికి వెళ్లి ఆడిట్ ఉందని, ఈకేవైసీ చేయించాలని చెప్పి పాసుపుస్తకాలు తీసుకున్నాడని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి డిపాజిట్ పత్రాలు, పాసుపుస్తకాలు ఇప్పించాలని, లేదంటే తమ డబ్బులు ఇవ్వాలని పోస్టాఫీస్ చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## స్వయం సహాయక సంఘాల రుణాల్లో 75 లక్షలు స్వాహా

- గ్రామస్థాయి నాయకురాలు, బ్యాంకు అధికారులపై అనుమానం
- పొడిచన్‌పల్లిలో ఘటన
- గుట్టుచప్పుడు కాకుండా పంచాయితీలు
- విచారణ ప్రారంభించిన అధికారులు

పాపన్నపేట, మే 15: మహిళా సాధికారత కోసం ప్రారంభించిన స్వయం సహకార సంఘం రుణాలు పక్కదారి పడుతున్నాయి. గ్రామ స్థాయి స్వయం సహకార సంఘం నాయకురాలు సుమారు రూ,75 లక్షలు స్వాహా చేసినట్లు తెలిసింది.ఇందులో బ్యాంకు అధికారుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కాగా సమస్య పరిష్కారం కోసం గ్రామస్థాయిలో గుట్టుగా పంచాయతీలు నిర్వహించినప్పటికీ పరిష్కారం దొరకలేదు. పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లి గ్రామంలో 39 మహిళా స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి.వీరికి స్థానిక యూకో బ్యాంకు రుణాలు ఇస్తుంటుంది.బ్యాంక్‌లోన్, స్త్రీనిధి, గ్రామ సంఘం ద్వారా రుణాలు అందుతుంటాయి.ఇందులో బాగంగా ఓ గ్రామ సంఘం నాయకురాలు,గ్రూపు సభ్యులకు అందాల్సిన రుణాలను తన స్వంతానికి వాడుకున్నట్లు తెలిసింది.అప్పట్లో ఉన్న బ్యాంకు మేనేజర్ ఈ తతంగంలో తన వంతు పాత్ర నిర్వహించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం గ్రూపు సభ్యుల ద్వారా బయట పడటంతో గ్రామ స్థాయిలో పంచాయతీలు పెట్టినట్లు తెలిసింది.అయితే వాటిని చెల్లించడానికి సదరు నాయకురాలు గడువు కోరినట్లు సమాచారం.

### రుణాలు ఎలా బదిలీ చేశారు

స్వయం సహాయక గ్రూపులకు రుణాలు మంజూరు కాగానే బ్యాంకు మేనేజర్‌లు మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా అందులో సభ్యుల పేర్లు రాసి, నేరుగా వారి అకౌంట్లలోకి నిధులు బదిలీ చేయాలి. కానీ ఇక్కడ సభ్యులకు తెలియకుండానే వారి రుణాలు ఓ గ్రామ స్థాయి నాయకురాలి అకౌంట్లోకి బదిలీ అయ్యాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లేకుంటే సభ్యులకు తెలపకుండా వారి పేరిట రుణాలు తీసుకునే అవకాశం లేదని తెలుస్తుంది. అయితే అప్పట్లో రుణాలు ఇచ్చినప్పుడు ఇక్కడ పని చేసిన బ్యాంకు మేనేజర్ ప్రస్తుతం పని చేస్తున్న మేనేజర్‌కు ఇటీవల ఫోన్ చేసి పలానా గ్రూపునకు సంబంధించిన రూ.5 లక్షల లోను వెంటనే కట్టించుకోవాలని, లేకుంటే వారి అకౌంట్ ఎన్‌పీఏ (నాన్ పర్ఫార్మెన్స్ అసెట్)గా మారతుందని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో అనుమానం వచ్చిన ప్రస్తుత మేనేజర్ లోతుగా దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. ఈ విషయం మహిళా సమాఖ్య అధికారుల దృష్టికి రావడంతో వెంటనే వారు రంగంలోకి దిగి బ్యాంకు స్టేట్‌మెంట్లు సేకరించే పనిలో పడ్డారు. అలాగే గ్రూపు సభ్యులతో మాట్లాడి వివరాలు రాబడుతున్నారు.

## విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్ తొలిగింపు

చిలిపిచెడ్, మే 15: మండలంలోని టొప్యి (ఎర్రమట్టి) తండా అంగన్‌వాడీ టీచర్ బులిని కలెక్టర్ విధుల నుంచి తొలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు నర్సాపూర్ సీడీపీవో హేమా భార్గవి, చిలిపిచెడ్ మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషిమాత గురువారం తెలిపారు. టొప్యి తండాలో ఓ శిశువు అనుమానాస్పద మృతిలో అంగన్‌వాడీ టీచర్ సహకారం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయని, అధికారులు విచారించి కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారన్నారు. బాలవివాహాలు, చిన్న పిల్లల కొనుగోలుపై అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

## మైనార్టీ సంక్షేమం, విద్యా ప్రగతికి పెద్దపీట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ

-మైనార్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ తారీఖ్ అన్సారీ

మెదక్ మున్సిపాలిటీ, మే 15: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమం, విద్యా ప్రగతికి పెద్దపీట వేస్తున్నదని మైనార్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ తారీఖ్ అన్సారీ అన్నారు. గురువారం జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయనకు కలెక్టర్ రాహుల్ రాజ్ స్వాగతించారు. కలెక్టర్ చాంబర్‌లో మైనార్టీ సంక్షేమం, విద్యాప్రగతిని తెలుసుకున్నారు. అనంతరం మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యనభ్యసించి, ఉత్తమ ఫలితాలు సాధించిన పోస్టర్‌ను కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి జెమ్లా నాయక్‌తో కలిసి ఆవిష్కరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రామాయంపేట/తూప్రాన్, మే 15: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం శెట్‌పల్లికలాన్‌కు చెందిన తలకొక్కుల శివరాములు (42) తూప్రాన్‌లోని వినోద్ దాబాలో పనులు చేస్తాడు. ఎప్పటిలాగే తన సైకిల్‌పై పనులకు వస్తుండగా మార్గమధ్యలో తూప్రాన్ శివారులో నలంద కళాశాల వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి అన్న మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



పాపన్నపేట, మే 15: ఆరేపల్లిలో ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఆర్ఐ నాగరాజు మాట్లాడుతూ గ్రామ శివారులోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసి గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో ఇసుకను నిల్వ చేస్తున్నారు. సుమారు 25 ట్రాక్టర్లున్న 12 ఇసుక కుప్పలను సీజ్ చేశారు.